# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 98 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

12-02-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# శ్రీకాకుళం మున్సిపాలిటీలో బిల్లుల రాజకీయం?

- అధికారుల తీరుపై మాజీ కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం
- అనుచరులకే ప్రాధాన్యం.. పారదర్శకతకు తూట్లు అన్న విమర్శలు




(నవతరం శ్రీకాకుళం)

శ్రీకాకుళం మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపుల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో అధికారుల ఏకపక్ష వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని కొందరు కాంట్రాక్టర్లు మండిపడ్డారు. మున్సిపాలిటీలో నిబంధనలు పక్కనపెట్టి కొంతమంది వ్యక్తులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ చెల్లింపులు జరుగుతున్నాయంటూ మాజీ కౌన్సిలర్లు కమిషనర్, కు వారు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని మాజీ కౌన్సిలర్లు ఆరోపించారు.
అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచుతూ, అధికారులకు (పాలకులు) సన్నిహితులైన వారికి మాత్రం వెంటనే చెల్లింపులు చేస్తున్నారని వారు విమర్శించారు.

## కీలక నేతల అనుచరులకే లబ్ధి?

మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపులు రాజకీయ ప్రభావంతో జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు కీలక నేతల అనుచరులకు మాత్రమే బిల్లులు మంజూరు చేసి, అర్హులైన వారిని పట్టించుకోవడం లేదని మాజీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సమగ్ర విచారణ జరిపించాలనీ డిమాండ్ చేస్తున్నారు .

## ప్రజాధన వినియోగంపై ప్రశ్నలు

ప్రజాధన వినియోగంలో పారదర్శకత లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.
మున్సిపాలిటీలో జరుగుతున్న చెల్లింపుల విధానం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, వెంటనే స్పష్టత ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన ఇంకా వెలువడలేదు. మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపుల వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# చెల్లింపుల జాప్యంపై కాంట్రాక్టర్ల ఆవేదన



- పెండింగ్ బిల్లుల వెంటనే చెల్లింపుకు డిమాండ్
- చెల్లింపుల ఆలస్యంతో ఆర్థిక ఇబ్బందులు
- సానుకూలంగా స్పందించిన కమిషనర్

(నవతరం శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి పెండింగ్ బిల్లుల చెల్లింపుపై వినతిపత్రం సమర్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు.
ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులు ఆలస్యమవుతున్న కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పనుల నిర్వహణకు అవసరమైన నిధులు అందకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడం, నిర్మాణ సామగ్రి సమీకరణ వంటి అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. నగరాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యం కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో ఆలస్యం కొనసాగితే అభివృద్ధి పనుల పురోగతిపై

-మిగతా 4లో

# అభాగ్యులకు అండగా 'న్యాయ' సేవాధికార సంస్థ

(నవతరం శ్రీకాకుళం)

ఆశ్రయాల్లో తలదాచుకుంటున్న అభాగ్యులకు, వృద్ధులకు, నిరాశ్రయులకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం అవసరమైతే నిర్భయంగా సంప్రదించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక వసతి గృహాలను సందర్శించారు. కలెక్టరేట్ రోడ్డులోని 'స్త్రీ సదనం'తో పాటు, ద్వారకా నగర్ ఇలిసిపురం నందు గల 'ఖ్యాతి ఫౌండేషన్' సీనియర్ సిటిజన్స్ హోమ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆశ్రమ వాసుల జీవన పరిస్థితులు, వారికి అందుతున్న ఆహారం మౌలిక సదుపాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. ఆశ్రితాశ్రమాల్లో ఉంటున్న వారు తమ కుటుంబ సభ్యులతో మళ్లీ కలవాలని ఆశిస్తే, అందుకు న్యాయ సేవాధికార సంస్థ పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వారిని కుటుంబాలతో కలిపేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.




సామాజికంగా, న్యాయపరంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కార్యదర్శితో పాటు అడ్వకేట్ జి. ఇందిరా ప్రసాద్, ఎస్. ధనలక్ష్మి, ఆర్. శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మెను విజయవంతం చేయండి



(నవతరం శ్రీకాకుళం)

రేపటి వేళ (12.02.2026) దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ ఛైర్మన్, శ్రీకాకుళం ఏపీఎన్జీజీఓ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్ పిలుపు ఇచ్చారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్జీఈఎఫ్) ప్రకటించిన ఈ సమ్మెలో భాగంగా రేపటి వేళ స్థానిక కలెక్టరేట్ దగ్గర భోజన విరామ సమయంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ నిరసన కార్యక్రమం (లంచ్ మోషన్ డిమానిస్ట్రేషన్) నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని, తమ నిరసన గళం వినిపించాలని పిలుపు ఇచ్చారు. ఈ మేరకు మీడియా సమావేశంలో ఏపీఎన్జీజీఓ జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాస రావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.జానకిరావు, కోశాధికారి బి.పూర్ణచంద్రరావు, పట్టణ ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా మహిళా కార్యదర్శి పి.శ్రావణి పాల్గొన్నారు.

**డిమాండ్లు :**

- నూతన కార్మిక చట్టాలు రద్దు చేయాలి
- వేతన సవరణ అమలు చేయాలి
- పీఎఫ్ఆర్డీఏ రద్దు చేయాలి
- పెండింగ్ బకాయిల చెల్లింపునకు చొరవ చూపాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కు తక్షణ చర్యలు చేపట్టాలి
- పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ అమలు చేయాలి
- పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ సొసైటీలలో పని చేస్తున్న ఉద్యోగులు 62 ఏళ్లకు పదవీ విరమణ చేసే విధంగా నిబంధనలు సడలించాలి
- కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల కోసం మెమో నంబర్ : 57 అమలు చేయాలి.

# నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యం




(నవతరం శ్రీకాకుళం)

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని సీపీఎం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ప్రాజెక్టులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
శ్రీకాకుళం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోనారి మోహన్‌రావులు మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యమే జిల్లా వెనుకబాటుకు

-మిగతా 3లో

ఎడిటోరియల్

# నాయకుడు పారిపోతాడా!

పార్లమెంట్ అనేది చట్టాలను చేసే సభ మాత్రమే కాదు. అది ప్రజల అభిప్రాయాలు ప్రతిధ్వనించే వేదిక. సభా మర్యాద, స్వేచ్ఛాయుత చర్చలు, భిన్నాభిప్రాయల గౌరవం, ఇవే ప్రజాస్వామ్యానికి పునాదులు. కానీ, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు చూస్తే ఈ పునాదులన్నీ క్రమంగా కూల్చివేయబడుతున్నాయనే ఆందోళన కలుగుతోంది. గురువారం ఉభయసభల్లో జరిగిన పరిణామాలు కేంద్రప్రభుత్వ ఏకపక్ష ధోరణికి అద్దంపడుతున్నాయి. ప్రతిపక్షాలను అడ్డుకోవడం, చర్చలకు తావివ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయి. ఇరుపార్టీలను పరిగణలోకి తీసుకోవాల్సిన సభాపతి పూర్తిగా అధికార పార్టీ అనుయాయునిగా వ్యవహరించారు. ప్రతిపక్ష నేతకు రెండు నిమిషాలైన మాట్లాడే అవకాశమివ్వాలని కోరినా పట్టించుకోలేదు. పైగా ప్రధానే మాట్లాడతారని ప్రకటించడం సభా సంప్రదాయాలను మంటగలిపాయి. ఇది తమ గొంతు నొక్కడమేనని ప్రతిపక్షాలు విమర్శించాయి. సభ నుంచి వాకౌట్ చేశాయి. ఎన్డీయే నిరంకుశ వైఖరికి ఇదొక పరాకాష్ట!

రాష్ట్రపతి ప్రసంగం ప్రభుత్వ విధానాల్ని పరిశీలించే రాజకీయపత్రం. దానిపై ప్రతిపక్షాలు ప్రశ్నించడం, విమర్శించడం ప్రజాస్వామ్యం. అయితే, ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన మోడీ సభకు రాకుండా తప్పించుకోవడం పార్లమెంటును అవమానించడమే కాదు, ప్రజల ప్రశ్నల నుంచి తప్పించుకోవడమే. ప్రధాని లేకుండానే ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించడం చూస్తే చర్చకు ప్రభుత్వం ఎంత భయపడుతుందో స్పష్టం. దీన్ని కప్పిపుచ్చే వైఖరి లోలోపలే నడవడం, దానికి సభాపతి సహకరించడం మరో విపరీతం! మహిళా ఎంపీల నుంచి ప్రధానికి ముప్పు వాటిల్లనుందనే పేరుతో ఆయన్ను సభకు రావద్దని స్వయంగా స్పీకర్ ఓం బిర్లా చెప్పడం అసహేతుకం. ఇది దిగజారిన ఆలోచనలకు రూపం. ప్రజలచేత ఎన్నుకోబడిన మహిళా ప్రతినిధులను దుండగులుగా చిత్రీకరించడం, స్త్రీ వ్యతిరేకతకూ, అప్రజాస్వామ్యానికి సంకేతం. సభాపతి చర్చ సజావుగా జరిగేలా చూడాలి. కానీ, అడ్డు తగలడం సభా మర్యాదనే కాదు, ప్రజల నమ్మకాన్నీ దెబ్బతీసే విధానం. ఇకపోతే, సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌ను ఉద్దేశించి మోడీ కొన్ని కీలకమైన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టూను ద్రోహి అంటూ అవమానించారని ఆరోపించారు. ఇది సిక్కు మతానికే అవమానమన్నారు. ఇది మతాల మధ్య విద్వేషాన్ని నింపడమే. లౌకికతత్వాన్ని సమాధి చేసి హిందూత్వం మీద దేశాన్ని నిర్మించాలనుకునే వారు మతాల గురించి మాట్లాడటం హాస్య స్పదం! అంతేకాదు, ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతి, అత్యున్నత రాజ్యాంగ పరిరక్షకురాలిని ప్రతిపక్షం లోక్‌సభలో దారుణంగా అవమానించిందన్నారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి పిలవకుండా రాష్ట్రపతిని అవమానించింది మోడీ కాదా? ఇలాంటి నేతలు ఇప్పుడు మతాలు, అవమానాల గురించి మాట్లాడటం వింతలో వింత. గతంలోనూ, ఇప్పుడూ బీజేపీ వైఖరిలో రాష్ట్రపతి పదవిపై గౌరవం లోపించిన సంఘటనలనేకం. రాజ్యాంగబద్ధమైన పదవిని రాజకీయ అవసరాల కోసం ఉపయోగించడం, ఆమె ప్రసంగాన్ని సైతం చర్చకు రాకుండా చేయడం, రాజ్యాంగం పట్ల కేంద్రానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రసంగాన్ని ప్రశ్నించడం ఒక అంశం, దాన్ని చర్చకే రాకుండా నిర్వీర్యం చేయడం బాధాకరం. చివరకు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా పారిపోయిన ప్రధానిగా నిలిచారు.

రాజ్యసభలో పరిస్థితి మరీ దారుణం. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్ అడిగిన ప్రశ్నలు, కేంద్రం తప్పించుకుంటున్న తీరును బయటపెట్టాయి. కేరళకు నిధుల్లో పక్షపాతం, సామాజిక రంగాలకు కోతలు, ఫెడరల్ స్ఫూర్తి ఉల్లంఘనలు,అమెరికాకు దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడంలాంటి ప్రశ్నలు ప్రభుత్వానికి అసహనాన్ని కలిగిస్తున్నాయి. అందుకే సమాధానాలివ్వకుండా ప్రశ్నించే గొంతునే అడ్డుకోవాలని చూస్తోంది. మైకులు ఆపేయడం, మధ్యలో మాటలు కట్ చేయడం, సభను తొందరగా వాయిదా వేయడం, ఇవన్నీ కూడా చర్చను అణిచివేయడానికి చేసిన చర్యలు. ప్రతిపక్షం మాట్లాకుండా ఉండాలని చూడటం ఒక ఎత్తుగడే కావచ్చు, కానీ ప్రశ్నలేని పాలన ప్రజాస్వామ్యం కాదు, అది ఏకచత్రాధిపత్యానికి ప్రతిబింబం. ఇది ఎంతోకాలం మనజాలదు. భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రజాస్వామ్య బలం. కానీ, ఆ భిన్న స్వరాలను అణిచివేస్తే, పార్లమెంట్‌లోనే చర్చలు లేకపోతే ప్రజల సమస్యలకు పరిష్కారాలు ఎక్కడ దొరుకుతాయి? ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రశ్న ఉండాలి, దానికి జవాబు కూడా ఉండాలి. అదే ప్రజాస్వామ్యం. లేదంటే అది రాచరికమే అవుతుంది. చివరకు పార్లమెంట్ ప్రజల గొంతుక వినిపించే వేదికగా ఉండాలా? అధికార పార్టీ ఆదేశాల సభగా మారాలా అన్నది నేడు దేశం ముందున్న మౌలిక ప్రశ్న.

# వర్శిటీలో సజావుగా గ్రేడ్-3 పరీక్షలు



నవతరం-ఎచ్చెర్ల

దేవాదయ శాఖలో కార్యనిర్వాహక అధికారుల(గ్రేడ్-3) ఉద్యోగాలు కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.....డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం కేంద్రంగా బుధవారం నిర్వహించిన పరీక్షలు సజావుగా ముగిసాయి. డా.బీఆర్ఏయూలో పరీక్షలు రాసేందుకు 535 మందికి హాల్ టిక్కెట్లు జారీచేయగా ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పేపర్-1కు 221 మంది. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం అయిదు వరకూ జరిగిన పేపర్-2 పరీక్షకు 220 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలను వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య పరిశీలించగా ఛీప్ సూపరింటెండెంట్ గా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖరరావు, అదనపు సూపరింటెండెంట్ గా పి.రామకృష్ణలు వ్యవహారించారు. ఏపీపీఎస్ సి నుంచి సెక్షన్ అధికారి కె.భాస్కరరావు, శ్రీకాకుళం డిప్యూటీ తాహాసిల్దార్ జి.కె.శ్రీనువాసరావులు ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

# రామనాథ స్వామిగా ఆరాధింపబడుతున్న రామేశ్వరుడు



\- తమిళనాడు రాష్ట్రం

రామేశ్వరం, తమిళనాడు రాష్ట్రంలోని రామనాథపురం జిల్లా లోని ఒక పట్టణం. ఈ పట్టణంలో రామనాథ స్వామి దేవాలయం ఉంది. తమిళనాడు రాజధాని చెన్నైకి 572 కి.మి దూరంలో ఉన్న ఈ పట్టణం ప్రధాన భూభాగం నుండి పంబన్ కాలువ ద్వారా వేరు చేయబడింది. హిందు ఇతిహాసాల ప్రకారం ఇక్కడే శ్రీ రాముడు సేతువు నిర్మించి లంకాధీనేతైన రావణాసురుడు పరిపాలించిన లంకకు చేరాడు. ఇక్కడ రాముడు నిర్మించిన సేతువుని రామసేతువు అని పిలుస్తారు. రావణాసురిడిని నిహతుడిని చేశాక రామనాథేశ్వర స్వామి ప్రతిష్ఠించాడు. రామేశ్వరము శైవులకు, వైష్ణవులకు అత్యంత పవిత్ర స్థలం.రామేశ్వరం తీర్థ స్థలమే కాక ఇక్కడ ఉన్న బీచ్ ల వల్ల పర్యాటక స్థలం కూడా ప్రాముఖ్యత సంపాదించుకొంది.

భారతీయులలో హిందువులు అనేకమంది కాశీయాత్ర రామేశ్వరం చూసిన తరువాతకాని పూర్తికాదని విశ్వసిస్తున్నారు. కాశీ గంగా తీర్థం తీసుకు వచ్చి రామేశ్వరం సముద్రంలో కలిపినట్టైతే కాశీయాత్ర పూర్తి ఔతుందని దేశంలోని సకల తీర్థములు చూసిన ఫలం దక్కుతుందని హిందువులు విశ్వసిస్తున్నారు. ఇక్కడ ప్రధానదైవం రామనాథస్వామి. గర్భాలయాన్ని 10వ శతాబ్దంలో శ్రీలంక చక్రవర్తి పరాక్రమబాహు నిర్మించాడు. భారతీయ నిర్మాణకళా వైభవాన్ని చాటిచెప్పే కట్టడాలలో ఒకటి అయిన ఈ ఆలయ లోపలి నడవ (నడిచేదారి) దేశంలో అతిపెద్దదని సగర్వంగా చెప్పుకుంటున్నారు.

12వ శతాబ్దం నుండి ఈ ఆలయనిర్మాణం వివిధ రాజులు నిర్మించారు. ఆలయంలోని పెద్ద భాగమైన నడవ లేక గర్భగుడి తరువాత ఉన్న ప్రాకారం 1219 అడుగుల 3.6 మీటర్ల ఎత్తైన వైభవంగా అలంకరించబడి తగిన విధంగా స్థాపించబడిన స్తంభాలతో నిర్మించిన నిర్మాణం. ఈ నిర్మాణం అడ్డంకులు లేని 230 మీటర్ల పొడవు ఉంటుంది. రామచంద్రుడు నిర్మించినట్లుగా చెప్పబడుతున్న వంతెన ఉన్న ప్రదేశాన్ని సేతుకరై (సేతు తీరం) అంటారు. రామాయణంలో వర్ణించబడిన ఈ సేతువును రామేశ్వరం సమీపంలో ఉన్న ధనుష్కోటి నుండి శ్రీలంకలో ఉన్న తలైమన్నార్ వరకు నిర్మించబడిందని పురాణ కథనాలు తెలుపుతున్నాయి.

## రామనాథేశ్వర దేవాలయం

దక్షిణభారతదేశంలో ఉన్న దేవాలయాల వలే రామేశ్వరంలో ఉన్న రామనాథస్వామి దేవాలయ ప్రాకారం నాలుగు వైపుల పెద్ద ప్రహారి గోడలతో నిర్మితమై, ఉంది. తూర్పు నుండి పశ్చిమ ప్రాకార గోడల మధ్య దూరం 865 అడుగులు, దక్షిణం నుండి ఉత్తర ప్రాకార గోడ ల మధ్య దూరం 657 అడుగులు. దేవాలయానికి నాలుగు దిక్కుల పెద్ద పెద్ద గాలి గోపురాలు ఉన్నాయి.

రామేశ్వరం దీవి, సముద్ర కెరటాలు, పక్షులు, బంగారు రంగులో మెరిసిపోయే ఇసుకతిన్నెలు, బంగారం లాంటి మనసులు, యాత్రికులు, రామనాథస్వామి గుడి, చిన్న చిన్న అంగళ్ళు, గవ్వలతో చేసిన వస్తువులు, గుర్రపు బళ్ళు, నీలి రంగులో మైమరపించే సముద్రం ఎన్నాళ్ళు చూసినా తనివి తీరదు. రామేశ్వరం ఒక అధ్యాత్మిక ప్రదేశమే కాదు అంతకంటే అద్భుతమైనది. తమిళనాడులో వున్న ఒక దీవి. రామేశ్వరంలో చూడాలి గాని చాలా ప్రదేసాలు ఉన్నాయి. రామనాథస్వామి గుడి, కొటి తీర్థాలు, రామపాదాలు, ధనుష్కోటి, విభీషణాలయం, ఇంకా చాలా చాలా ఉన్నాయి.

రామేశ్వరం... తమిళ నాడులో హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం సంగమ స్థానంలో కనిపించే చిన్న ద్వీపం. అలాంటి ద్వీపంలో పరమేశ్వరుడు రామనాథస్వామిగా కొలువు దీరి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. దేశ వ్యాప్తంగా ఉన్న పన్నెండు జ్యోతి ర్లింగాల్లో ఒకటిగా ప్రసిద్ధిపొందిన ఈ రామనాథస్వామి ఆలయ నిర్మాణం భక్తులను ఆశ్చర్యచకి తుల్ని చేస్తే... ఇక్కడ కొలువైన స్వామి స్వరూపం వెనుకా ఆసక్తి కరమైన కథనం ఉంది. అందుకే రామేశ్వరం ఆధ్యాత్మిక ధామం గానూ, పర్యటక ప్రాంతంగానూ పేరుగాంచి అటు భక్తుల్నీ, ఇటు పర్యటకుల్నీ ఆకట్టు కుంటోంది. ఈ ఆలయంలోకి ప్రవే శించి... ఇక్కడి తీర్థా లను చుట్టేస్తూ ఆ తరువాత శిల్పకళా సంపదనీ వీక్షిస్తూ స్వామిని దర్శించుకోవ దానికి కనీసం నాలుగు గంటలు పడుతుందంటేనే



అర్థంచేసుకోవచ్చు... ఆలయం ఎంత గొప్పగా ఉంటుందో. అవును మరి... పదిహేను ఎకరాల్లో విస్తరించి నాలుగువైపులా నాలుగు గోపురాలతో కనిపించే ఈ ఆలయంలోని మూడో ప్రాకారంలో దాదాపు ముప్పై అడుగుల ఎత్తులో వెయ్యికిపైగా స్తంభాలు ఉంటాయి. అందుకే ప్రపంచంలోనే అతి పొడవైన ప్రాకారం కలిగిన ఆల యంగా ఈ గుడి ప్రసిద్ధిగాంచింది. ప్రారంభంలో కేవలం గడ్డి పాక రూపంలో ఉన్న ఈ ఆలయాన్ని ఇంత అద్భుతంగా నిర్మించడం వెనుక ఎందరో రాజుల కృషి ఉంది.

## సీతమ్మ చేసిన శివలింగం...

త్రేతాయుగంలో సీతాదేవిని అపహ రించిన రావణాసురుడిని సంహరించేం దుకు... శ్రీరామచంద్రుడు వానర సైన్యంతో కలిసి రామేశ్వరం నుంచే రామసేతును నిర్మించి శ్రీలంకకు చేరుకున్నాడట. రావణసంహారం అనంతరం రాముడు - సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు, సుగ్రీవుడితో కలిసి అయోధ్యకు ప్రయాణం అవుతూ ఇక్కడ సేదతీరాడట. ఆ సమయంలో మహా జ్ఞానీ, శివభక్తుడూ అయిన రావణ బ్రహ్మను సంహరించినందుకు బాధ పడుతూ తనకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకోకుండా పరిష్కారం చూపమని మహర్షులను అడిగాడట. అంతా కలిసి శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించమని సలహా ఇవ్వడంతో కైలాసానికి వెళ్లి శివలింగాన్ని తీసుకురమ్మంటూ రాముడు హనుమంతుడిని ఆదేశించా డట. అయితే ముహూర్త సమయం దగ్గరపడుతున్నా హనుమంతుడు రాకపోయేసరికి సీతాదేవి సముద్రపు ఒడ్డున ఇసుకతో శివలింగాన్ని తయారు చేయడంతో రాముడు ఆ శివలింగానికే పూజలు జరిపించాడట. ఆ తరువాత శివలింగంతో వచ్చిన హనుమంతుడు విషయం తెలిసి అగడంతో రాముడు రెండింటినీ ప్రతిష్ఠిం... మొదట హనుమంతుడు తెచ్చిన శివలింగాన్నే దర్శించుకోవాలనే నియమాన్ని పెట్టాడట. అందుకే ఇప్పటికీ హను మంతుడు తెచ్చిన శివలింగానికి పూజలూ, నైవేద్యాలూ జరిపాకే... రామలింగానికి పూజలు చేస్తారు అర్చ కులు. ఇలా రెండు శివలింగాలు కలి గిన అరుదైన ఆలయంగానూ ఈ గుడి గుర్తింపు సాధించింది. అలా రాముడు ప్రతిష్ఠించిన రామనాథస్వామి జ్యోతిర్లిం గంగా పూజలు అందుకుంటున్నాడు.

అగ్నితీర్థంలో స్నానమాచరించాకే , రామేశ్వరంలో మొత్తం ఆరవైనా లుగు బావులు ఉంటే... వాటిల్లో ఆలయంలో ఉన్న ఇరవైరెండు అతి ప్రధానమైనవిగా చెబుతారు. రావణ సంహారం అనంతరం రాముడి అమ్ములపొదిలో మిగిలిన ఇరవైరెండు బాణాలతోనే ఇక్కడ ఇరవైరెండు బావుల్ని సృష్టించాడనీ అంటారు. ఇక్కడకు వచ్చే భక్తులు మొదట సముద్రపు ఒడ్డునున్న అగ్ని తీర్థంలో స్నానమాచరించాకే ఆలయం లోపలికి వెళ్తారు. అలాగే ఆలయం లోపల ఉన్న ఇతర తీర్థాలన్నింట్లో కాకపోయినా ఒకటి రెండింట్లోనైనా స్నానమాచరించొచ్చు. ఈ తీర్థాలన్నీ సముద్రపు ఒడ్డున ఉన్నా కూడా ఒక్కో బావి నీటి రుచి ఒక్కోలా ఉండటమే కాదు... కొన్ని బావుల్లోని నీరు తియ్యగానూ ఉండటం విశేషం. ప్రతి తీర్థానికీ ఆయుర్వేద సుగుణాలు ఉంటాయనీ చెబుతారు. ఈ తీర్థాలకు సావిత్రి, గాయత్రి, సరస్వతి, నల, నీల సూర్య, చంద్ర, గంగ... తదితర పేర్లు ఉంటాయి.

## 108 శివలింగాలు


తీర్థాల్లో స్నానమాచరించిన భక్తులు మొదట హనుమంతుడు తెచ్చిన శివలింగాన్ని దర్శించుకున్నాకే జ్యోతి ర్లింగాన్ని పూజిస్తారు. శివలింగాల దర్శనమయ్యాక పర్వతవర్ధినిగా పూజలు అందుకుంటున్న పార్వతీదేవి మందిరానికి వెళ్తారు. ఆ తరువాత విశ్వేశ్వరుడు, విశాలాక్షి, విష్ణుమూర్తి, మహాలక్ష్మి, సంతాన - సౌభాగ్య గణపతి, నటరాజు, నవగ్రహ మండపం, వల్లీదేవసేన సమేత కార్తికేయుడు.. తదితర దేవతా మూర్తుల్ని దర్శించుకోవచ్చు. ఆలయం ప్రాకారాల్లో నడిచే భక్తులు -మహర్షులు ప్రతిష్ఠించిన 108 శివలింగా లనూ చూసి మంత్రముగ్ధులవుతారు. రామలింగ ప్రతిష్టను తెలియజేసే మందిరమూ ఉందిక్కడ. నంది మండపంలోని నంది విగ్రహం దాదాపు పదిహేడు అడుగుల ఎత్తు ఉంటుంది. హనుమంతుడి విగ్రహం శ్రీలంకవైపు చూస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఇక్కడున్న లక్ష్మణతీర్థంలో పితృతర్పణ కార్యక్రమా లనూ నిర్వహించొచ్చు. ఆలయ ప్రాంగణంలో ఏడాది మొత్తం జరిపే పూజలు ఒకెత్తయితే ప్రత్యేక పర్వదినాల్లో నిర్వహించే ఉత్సవాలు మరొకెత్తు. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా పదిరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తుల్ని పురవీధుల్లో ఊరే గించడం, అభిషేకాలూ, దీపాల అలం కరణలు చూసేందుకు రెండు కళ్లూ సరిపోవు. అలాగే జులై, ఆగస్టు నెలల్లో తిరుకల్యాణం పేరుతో పదిహేడు రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు జరుగు తాయి.ఆ సమయంలో జరిగే రామనాథస్వామి-పర్వతవర్ధిని కల్యాణాన్నీ ఇతర సాంస్కృతిక కార్యక్రమాలనూ చూసి తరించాల్సిందే. దేవీశరన్నవరాత్రులు, నటరాజ నిజరూప దర్శనం, రామలింగ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రత్యేక ఉత్సవం, ఆరుద్ర దర్శనం పేరుతో విశేషమైన కార్యక్రమాలు, శ్రీరామ నవమి.. ఇలా ఏడాది మొత్తం ఎన్నో వేడుకలు జరుగుతాయిక్కడ.

రామేశ్వరానికి వచ్చే భక్తులు కేవలం స్వామి దర్శనంతోనే వెనుతిరిగి వచ్చేయరు. ఇక్కడున్న ధనుష్కోడి, పాంబన్ వంతెన, తేలే ఇటుకలు, గంధమాదన పర్వతాన్ని సందర్శిస్తారు. రాముడి పాదుకలు ఉండే గంధమాదన పర్వతం పైకి ఎక్కితే రామేశ్వరం మొత్తం కనిపిస్తుందట.

రామేశ్వరంలోని సముద్రానికి శాంత సముద్రమని పేరు. అలల ఉధృతిలేని సముద్రాన్ని ఇక్కడ మాత్రమే చూడొచ్చు.రామేశ్వర యాత్రను ఓ పద్ధతి ప్రకారం చేస్తే పుణ్యక్షేత్రాలన్నింటినీ దర్శించిన ఫలితం దక్కుతుందట. భక్తులు మొదట వారణాసికి వెళ్లి కాశీ విశ్వనాథుడిని పూజించి అక్కడి నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి రామేశ్వరం లోని శివుడికి అభిషేకించాలి. మళ్లీ ఇక్కడున్న ఇసుకను తీసుకెళ్లి కాశీలోని గంగలో కలపాలని అంటారు. పైగా భారతదేశంలో ఉన్న నదులన్నీ ఇక్కడున్న బావుల అంతర్భాగం నుంచే ప్రవహిస్తాయని చెబుతారు. అందుకే రామనాథస్వామిని దర్శించుకుంటే సమస్త యాత్రాఫలితం కలుగుతుందని ప్రతీతి.

ఆలయాన్ని ఇలా చేరుకోవచ్చు.. ఆలయం లోనికి వెళ్ళటానికి వీలుగా సముద్రం పై రైలు వంతెన (పాంబన్ రైలు వంతెన), రోడ్డు వంతెన (ఇందిరా గాంధీ వంతెన) ఉన్నాయి. ఈ వంతెనలు సుమారు రెండున్నర కిలోమీటర్లు సముద్రం పై నిర్మించబడ్డాయి. రైలు వంతెన ఓడలు వచ్చినప్పుడు రెండుగ విడి పోతుంది. ఇక్కడ బీచ్లో కూర్చుని సుర్యోదయం, సుర్యాస్తమయం చూస్తు ఆ అనుభూతి అనుభవిస్తే మనసుకు ఎంతో ప్రశాంతత చేకూరుతుంది. చెన్నై నుండి రామేశ్వరానికి దినసరి రైళ్ళు గలవు.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



# నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యం

**మొదటి పేజీ తరువాయి**

కారణమని విమర్శించారు. వంశధార రిజర్వాయర్‌ను 2005లో ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదని, ఇది ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానం పూర్తి చేసి సాగునీరు అందిస్తే వ్యవసాయం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం వల్ల జిల్లాకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. గొట్టా బ్యారేజ్ ఆధునికరణ, నేరడి బ్యారేజీ నిర్మాణం, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి వంటి కీలక ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధికి పెండింగ్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు.

## రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు అరెస్ట్

# 24 కిలోల గంజాయి స్వాధీనం

**నవతరం -శ్రీకాకుళం :**



నరసన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 10-02-2026 తేదీన నమోదైన రెండు ఎన్‌డీపీఎస్ కేసులు (క్రైం నం. 27/26, 28/26)కు సంబంధించి నరసన్నపేట పోలీసులు వేగవంతమైన దర్యాప్తు చేపట్టి నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 24 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

కేసు నం. 1:
అసిఫ్ ఖాన్ (34), తాండ గ్రామం, బాగాపట్టు బ్లాక్, ఉత్తర ప్రదేశ్ మరియు అధిల్ ఖాన్, తాండ గ్రామం, బాగాపట్టు బ్లాక్,ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇద్దరు గంజాయి అక్రమ రవాణా చేస్తూ బుధవారం మడపం టోల్ ప్లాజా వద్ద పట్టుబడ్డారు వారిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి సుమారు 12 కిలోల మత్తు పదార్థం స్వాధీనం చేసుకున్నారు.

కేసు నం. 2:
ఈసాకో రైతా (52), అనుగురు, బీమానాపూర్, గజపతి జిల్లా, ఒడిశా రాష్ట్రం మరియు సాగర్ పహాన్ (27), కమలపాదర్, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఇద్దరు గంజాయి అక్రమ రవాణా చేస్తూ బుధవారం మడపం టోల్ ప్లాజా వద్ద పట్టుబడ్డారు వారిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి సుమారు 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఈ రెండు కేసులు ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్లు 20(ఎ)(ఎఎ)(దీ) తీ/ష 8(ఎ) చీణూాూ‌ాషీ కింద నమోదు చేయబడి, చట్టపరమైన చర్యలు చేపట్టి తదుపరి దర్యాప్తు చేపట్టారు.
ఈ కేసుల వివరాలను తెలియజేయుటకు నరసనపేట సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కేసుల నమోదు విధానం, అరెస్టు వివరాలు, స్వాధీనం పరిమాణం మరియు తదుపరి దర్యాప్తు ఇన్స్పెక్టర్ వివరణ ఇచ్చారు.
గంజాయి వంటి
మత్తు పదార్థాలు అక్రమ రవాణా మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు కోరారు.

# కోతికి ప్యాకెట్ మనీ - కొంపకు నిప్పు



అల్లరి పిల్లలు అడవి కోతులే...
వారి కోరికలు అందని ద్రాక్షలే...
తల్లిదండ్రులు ఆకలి తీర్చే
అరిటాకులే...
పిల్లలు ఆఆకుల్ని చిరునవ్వులతో చీల్చే
గులాబీ గుండెల్లో గుచ్చుకునే ముళ్లే...

ప్రేమతో ఇచ్చే ప్యాకెట్ మనీకి
కోత పెడితే..? కొంపలారిపోతాయి
పిల్లకోతులు ఇల్లు పీకి పందిరేస్తాయి
ఎందుక్కన్నారంటూ ప్రశ్నిస్తారు
కోర్టులో లాయర్లలా వాదిస్తారు
ప్యాకెట్ మనీ కోసం వేధిస్తారు
నో అంటే ఏటీఎం కార్డులు
లాగేసుకుంటారు పిన్ లు
మార్చేస్తారు.

చేతిలో సెల్ ఫోను లాక్కుంటే
పిల్లలు శివమెత్తిన రుద్రులే,
యూట్యూబ్ లో ఆడేగేమ్స్ కి
అడ్డుపడితే
నిప్పులు చెరిగే అగ్నిపర్వతాలే,
నిజానికి
పిల్లల పెంపకం నిప్పుతో చెలగాటమే,

తేనెతుట్టెను కదిపి తేనె
కోరుకోవడమే...
మొక్కై వంగనిది మానై వంగదు...
పిల్లల మొండితనం ముదిరితే
ముప్పే...
నిఘా పెట్టకపోవడం
తల్లిదండ్రుల తప్పే...

ఇదిగో బైబిల్ సందేశం
స్మరించుకో
ఈ అపాయం నుంచి
తప్పించుకునే
ఉపాయమిదే
గుర్తుంచుకో
ముందుగా నీ కంటిలో
ఉన్న
"దూలాన్ని" తీసెయ్
అప్పుడు నీ బిడ్డ
కంటిలోని
"నలుసు" నీకు తేటగా కనిపిస్తుంది.
తీసివేయుట సులభమే...

ప్యాకెట్ మనివ్వకపోతే పిల్లలు
నీరులేని చెరువులో చేపలే...
చేతిలోని సెల్ ఫోన్ లాగేస్తే
గాయపడిన చిరుత పులులే...
పిల్లల పెంపకానికి క్రమశిక్షణే
శ్రీరామరక్ష.

అందుకే ఓ తల్లిదండ్రులారా...
జాగ్రత్త తస్మాత్ జాగ్రత్త...
మీ సెల్లు జాగ్రత్త...
మీ ఒళ్లు జాగ్రత్త...
మీ ఇల్లు జాగ్రత్త...
మీ కళ్ళు జాగ్రత్త...
అగ్గి పుల్లల్లాంటి మీ పిల్లలు
జాగ్రత్త...
అప్రమత్తంగా లేకపోతే అంతా
భస్మమే..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్



# చరణ్-సుక్కూ కలిశారు.. మరి ఆమె సంగతేంటి?

రామ్ చరణ్ తో సినిమాకు రెడీ అవుతున్నాడు సుకుమార్. దీనికి సంబంధించి కథ కూడా ఫైనల్ అయింది. పుష్ప టైపులోనే ఇది కూడా 2 భాగాలుగా వస్తుందనే ప్రచారం నడుస్తోంది. వచ్చేనెల చరణ్-సుక్కూ సినిమాపై అధికారిక ప్రకటన కూడా రాబోతోంది. మరి ఆమె సంగతేంటి?
కొన్నేళ్ల కిందటి సంగతి.. చరణ్-సుకుమార్ కలిసి రంగస్థలం సినిమా చేశారు. ఆ సినిమాలో ముందుగా అనుపమ పరమేశ్వరన్ ను హీరోయిన్ గా తీసుకున్నారు. కొన్ని రోజులకు ఏమైందో ఏమో, ఆమెను తప్పించి, సమంతను తీసుకున్నారు. సినిమా రిలీజైంది, బ్లాక్ బస్టర్ హిట్టయింది. చిట్టిబాబుగా చరణ్, రామలక్ష్మిగా సమంత మెరిశారు. ఆ టైమ్ లో అనుపమ తీవ్ర నిరాశ వ్యక్తంచేసింది. ఆ తర్వాత మరో సినిమా ప్రచారంలో పాల్గొన్న సుకుమార్ ఆమెకు మాటిచ్చాడు. అనుపమలో మంచి టాలెంట్ ఉందని, కచ్చితంగా ఆమెను తీసుకుంటానంటూ ప్రకటించాడు.
ఇప్పుడు ఆ టైమ్ రానే వచ్చింది. రంగస్థలం కాంబో మళ్లీ కలిసింది. అనుపమ కూడా ఇంకా లైమ్ లైట్లోనే ఉంది. మరి ఈసారైనా ఆమెకు సుకుమార్ ఛాన్స్ ఇస్తాడా?
కెరీర్ లో కొన్ని మంచి సినిమాలు చేసింది అనుపమ. ఇప్పటికీ ఆమెకు అవకాశాలొస్తున్నాయి. అయితే స్టార్ హీరోల రేంజ్ కు మాత్రం ఆమె వెళ్లలేకపోయింది. ఆమె పరిమితులు ఆమెకున్నాయి, కాదనలేం. కానీ నటన విషయంలో అనుపమను తక్కువ చేయడానికి వీల్లేదు. సో.. ఈసారి సుక్కూ ఎలాంటి ఫిమేల్ లీడ్ క్యారెక్టర్ రాసుకున్నాడో చూడాలి!

# 'గీతా' మీద దృష్టి పెట్టిన బన్నీ!




అల్లు అరవింద్ కష్టపడి, స్వయంగా నిర్మించిన సామ్రాజ్యం గీతా పిక్చర్స్. థియేటర్లు, పంపిణీ, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ ఇలా పలు శాఖలుగా విస్తరించింది. ఈ సామ్రాజ్యానికి ముగ్గురు వారసులు.. అల్లు బాబీ.. అల్లు అర్జున్..అల్లు శిరీష్. కానీ ఎవరూ గీతా సంస్థ నిర్వహణలో యాక్టివ్ గా పార్టిసిపేట్ చేసింది లేదు.
నిజానికి ఆ అవసరమూ కలగలేదు. ఎందుకంటే అల్లు అరవింద్ అన్నీ తానై చూసుకుంటారు. సరైన, ది బెస్ట్ అనే వాళ్లను తెచ్చి తన స్టయిల్ లో తీర్చిదిద్ది తలో పని అప్పగించారు. అలా గీతా సంస్థకు పని జరిగిపోతూ వస్తోంది. అయితే బన్నీ వాస్ తన పనిలో తాను వున్నారు.
మెగాస్టార్ తోడల్లుని కుమార్తె విద్య ఇప్పుడు గీతా లో కీలకంగా వున్నారు. మిగిలిన విభాగాలకు కూడా సరైన మనుషులే వున్నారు.
ఇలాంటి నేపథ్యంలో అల్లు అర్జున్ గీతా సంస్థ మీద దృష్టి పెట్టారు. గీతా సంస్థ ను ఓవరాల్ గా సూపర్ వైజ్ చేసే పని పెట్టుకున్నారు. రెగ్యులర్ డైలీ ఆడ్మినిస్ట్రేషన్ పనులు కాకుండా, అప్పుడప్పుడు జరిగే రివ్యూ మీటింగ్ లు, ఏం జరుగుతోంది. ఏం ప్లాన్ చేయాలి ఇలాంటి హై లెవెల్ డెసిషన్ మేకింగ్ లో బన్నీ కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.
బన్నీ ఎంటర్ అయిన తరువాత సంస్థలో కొన్ని మార్పులు చేర్పులు జరిగినట్లు తెలుస్తోంది. దశాబ్దాల కాలంగా పని చేస్తూ, కేవలం ఆ అసోసియేషన్ తో అలా వుండిపోయిన వారిని గౌరవప్రదంగా తప్పించి, యంగ్ బ్యాచ్ తో ఫిల్ చేసినట్లు తెలుస్తోంది. నిజానికి ఇప్పటికే ఆలస్యమైంది. అల్లు అరవింద్ నిర్మించిన సామ్రాజ్యాన్ని ముగ్గురు కొడుకుల అందుకుని బలంగా ముందుకు తీసుకెళ్లాల్సి వుంది. ఆ దిశగా ఇప్పటికైనా బన్నీ ముందుకు అడుగేసారు. సంతోషం.

# పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి' కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**నవతరం-టెక్కలి**

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా టెక్కలిలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళి అర్పించారు. ముందుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బీజేపీ నాయకులు ఆయన సేవలను స్మరించుకుని, దేశాభివృద్ధికి ఆయన అందించిన ఆలోచనలు మరియు సిద్ధాంతాలను వివరించారు. ఈ సందర్భంగా టెక్కలి మండల అధ్యక్షులు మరియు కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ మాట్లాడుతూ, “సమాజంలోని చివరి వ్యక్తి అభివృద్ధే అసలైన అభివృద్ధి” అనే ఉపాధ్యాయుల సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. యువతలో జాతీయ చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని కూడా వారు ప్రస్తావించారు.
అనంతరం కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆయన సమగ్ర మానవతవాదం అనే తత్వవేత భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచం మొత్తం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలను అందించగలదు. సందర్భంగా గౌర ప్రదమైన నివాళులు అర్పించారు
ఈ కార్యక్రమం ద్వారా టెక్కలి ప్రజల్లో జాతీయ భావన మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు. చివరగా సభకు హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ కార్యక్రమం ముగిసింది.
ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ జన్ని పరమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నడుపూర్ లక్ష్మీనారాయణ, జిల్లా కిషన్ మోర్చా కార్యదర్శి ధూపాన కామేశ్వర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు ఆకులు ప్రకాష్, పిట్ట రామ్మోహన్ రావు, పోతూజు నాగేంద్ర, సంపత్ రావు రమేష్, సోషల్ మీడియా అరి వెంకట రావు, భీమాన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# చెల్లింపుల జాప్యంపై కాంట్రాక్టర్ల ఆవేదన

**మొదటిపేజీ తరువాయి**

ప్రభావం పడే అవకాశం ఉందని కాంట్రాక్టర్లు తెలిపారు. నగరంలో చేపట్టాల్సిన కొత్త పనులు కూడా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటూ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కాంట్రాక్టర్ల సమస్యలను కమిషనర్ శ్రద్ధగా విని, సంబంధిత విభాగాలతో చర్చించి పెండింగ్ బిల్లుల చెల్లింపుపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో జి.వి. రామాయుడు, విజయ్ కుమార్, గంగరాజు, సూర్యనారాయణ, కాశీపతిరావు తదితర కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి




**నవతరం -పాలకొండ**
కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ల అమలు ప్రక్రియ రద్దు చేయాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పాత పద్ధతిలో అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలు ఉపసంహరించు కోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. పాలకొండ నగర పంచాయతీ ఆవరణలో బుధవారం నిర్వహజంచిన ప్రచార కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, ఉద్యో వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ల సేవలో నిమగ్నమైన కేంద్ర ప్రభుత్వం కష్టజీవులు, కార్మికులకు నష్టం చేకూర్చేలా కొత్తగా లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టిందని, ఇవి అమలు జరిగితే కనీస వేతనాలు ఉద్యోగ భద్రతపై ప్రశ్నించే హక్కు కూడా కార్మికులు, ఉద్యోగులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్రోద్యమ కాలం నాటి చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. గ్రామీణ పేదలకు ఎంతో ఆర్థిక ఆసరాగానున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను ఎట్టి పరిస్థితిల్లోను కార్మిక వర్గం, కష్టజీవులు అంగీకరించరని హెచ్చరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త కార్మిక ,కర్షక వర్గాల ప్రజలు సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు, ఈ సమ్మె ను జయప్రదం చేసేందుకు పాలకొండ దుర్గ గుడి సెంటర్ కు ఉదయం తొమ్మిదిన్నర గంటలకే కార్మిక వర్గం, ఉద్యోగులు, గ్రామీణ పేదలు, రైతులు హాజరై సమ్మె విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ ఇంజనీరింగ్ విభాగం కార్యదర్శి వై హరిబాబు శానిటేషన్ విభాగం కార్యదర్శి సీహెచ్.సంజీవి, పి సాయి, బి సురేష్, కె.రాజేష్, వై.సురేష్, పి.సతీష్, వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

# హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహణ
- విశాఖ మెడికవర్ వైద్యులచే 2డీ ఈకో పరీక్షలు
- అవసరమైతే ఎన్టీఆర్ వైద్య సేవ కింద చికిత్స








**(నవతరం శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగరంలోని బలగ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిధిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (ణజు×జ)లో హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గౌరవ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత ఆదేశాల మేరకు ఆర్‌బీఎస్‌కే (=దీూఖ) ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శివరంజని, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పి. రాము ఆధ్వర్యంలో ఈ శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.
ఈ శిబిరానికి విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రి నుంచి విచ్చేసిన పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు చిన్నారులకు ఉచితంగా 2డీ ఈకో, కార్డియోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం పిల్లల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే శస్త్రచికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తామని వైద్యులు తెలిపారు.
అలాగే అర్హులైన చిన్నారులకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచిత వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. చిన్నారుల్లో హృద్రోగాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వైద్యులు పేర్కొన్నారు.
ఇలాంటి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ నెల 13వ తేదీన టెక్కలి జిల్లా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రంలో మరోసారి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈఐసీ పీడియాట్రిషియన్ డాక్టర్ నూక చైతన్య, వైద్య సిబ్బంది మరియు ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యుని కోసం కథా సాహిత్యం కళింగసీమ నుంచే మొదలైంది'

## ‘ఎరిక’ ప్రథమ సమావేశంలో వక్తలు



**నవతరం ఎచ్చెర్ల**

ప్రజా సాహిత్యానికి, అభ్యుదయ కథకు ఆది నుంచి చిరునామాగా నిలిచినది కళింగ నేలేనని ప్రముఖ రచయిత, సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు అభిప్రాయపడ్డారు. తెలుగు భాషలో తొలి కథ ‘దిద్దుబాటు’ ఈ ప్రాంతం నుంచే వెలువడిందన్నారు. రచయిత ఎస్.బాల సుధాకర్ మౌళి(విజయనగరం) ‘ఎరిక’ పేరిట స్థాపించిన కళింగ సాహిత్య పాఠశాల ప్రథమ సమావేశం డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై అట్టాడ అప్పలనాయుడు, ‘కళింగ సాహిత్యం: దశ-దిశ ‘ అనే అంశంపై ప్రసంగించారు. రాజులు, జమీందార్ల కోటలు దాటి.... సామాన్యుని కోసం, ఆదివాసీలు, రైతులు, వారి పోరాటాలు కోసం శతాబ్ది క్రితమే కళింగ సీమలో రచనలు, కథలు వెలువడి ఇతర తెలుగు నేలలకు స్ఫూర్తిని పంచాయన్నారు. అన్ని ప్రకృతి వనరులు ఉన్నా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ ప్రాంతం వెనుకబడటాన్ని నిరసిస్తూ 60 దశకంలో జరిగిన శ్రీకాకుళోద్యమాన్ని కథా వస్తువుగా చేసుకొని కళింగనేల రచయితలు, గాయకులు చైతన్యవంతమైన కథలు, గేయాలు వెలువరించారన్నారు. సంక్షేమం పేరిట పాలకులు ప్రవేశపెట్టిన స్కీంల్లో స్కామ్ లను ప్రముఖంగా ప్రస్తావిస్తూ 80వ దశకంలో సామాజిక స్పృహ కల్గించే పలు కథలు ఇక్కడి నుంచి ప్రచురితమయ్యాయన్నారు. అభివృద్ధి పేరిట స్థానికేతర వలసవాదులు, కళింగనేలను కబ్జా చేస్తున్న దోపిడీపై నేటి తరం కథకలు, పాత్రికేయులు అనేక కథలు, రచనలను రాస్తున్నారన్నారు. యువతరం, విద్యార్థులు వీటిని చదవి, వాస్తవాలు విశ్లేషించుకొని.... పలు రంగాల్లో ఈ ప్రాంత పరిరక్షణకు సాహిత్య వారసత్వాన్ని అందుకోవాలని అట్టాడ అప్పలనాయుడు సూచించారు.
ప్రత్యేక వక్తగా పాల్గొన్న రచయిత, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, మానవీయ విలువలు మనిషిలో ఉండాలంటే అవి సాహిత్యం వలనే సాధ్యమన్నారు. సమాజాన్ని, గ్రామాల పరిస్థితిలను, దేశ వర్తమాన, చారిత్రక అంశాలను తెలుసుకోవాలంటే కథా సాహిత్యం ప్రతి ఒక్కరూ చదవాలన్నారు.
చదువు....మంచి కెరీర్ కోసం ఉపయోగించుకొని సామాజిక స్పృహతో సాహిత్యాన్ని కూడా జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు.
‘ఎరిక’ వ్యవస్థాపకులు ఎస్. బాల సుధాకర్ మౌళి మాట్లాడుతూ కళింగ సాహిత్యంలోకి స్థానికత రావాలని, తద్వార ఈ నేల ప్రజలను మరింతగా చైతన్య పరచవచ్చునన్న ఉద్దేశ్యంతో ఈ పాఠశాల స్థాపించామన్నారు.
కళింగాంధ్ర జిల్లాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక సమావేశాల ద్వారా సాహిత్య రచనపై తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.
వర్శిటీ జర్నలిజం విభాగం అధ్యావకులు డా. జి. లీలావరప్రసాదరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి కె.శ్రీనువాస్, కవి కలమట దాసుబాబు, వర్శిటీ అధ్యాపకులు డా. కె.ఉదయ్ కిరణ్, డా. ఆర్.తిరుపతిరావు, డా.కె.శ్రీనివాస్. డా. బలరాంనాయుడులు మాట్లాడారు. తెలుగు, జర్నలిజం, కెమిస్ట్రీ తదితర విభాగాల విద్యార్థులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**